క్లుప్తంగా

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు రేవతి

సీలేరు: సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మహిళా పోలీసు రేవతి విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యంలో వివాహాలు చేసుకోవడం వల్ల పుట్టే పిల్లలు అనారోగ్యంతో జన్మిస్తారని, మాతా, శిశు మరణాలు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. బాల్య వివాహాలు జరిగినట్టు తెలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎఫ్‌పీ గ్రూపు సభ్యులకు శిక్షణ


అప్పలరాజుపేటలో శిక్షణ ఇస్తున్న వీవోఏ

రాజవొమ్మంగి: మండలంలో ఎంపిక చేసిన సుమారు 200 ఎంఎఫ్‌పీ (మైక్రో ఫారెస్ట్ ప్రొడక్ట్స్) గ్రూపుల సభ్యులకు గ్రామాల్లో వీఓఏలు (బుక్ కీపర్స్) శిక్షణ ఇస్తున్నట్లు వెలుగు ఏపీఎం రామాంజనేయులు తెలిపారు. అప్పలరాజుపేటలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ప్రతి గ్రూపు ఏర్పాటుచేసుకొని, కమిటీ నియమించుకోవాలని, బ్యాంకు ఖాతా తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రూపు తమ పరిధిలోని అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు, భద్రపరచుకోవడం, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వీడీవీకేలను (వన్‌ధన్ వికాశ కేంద్రాలను) ఏర్పాటు చేసి అవి సమర్థవంతంగా పనిచేసేలా చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


చిన్నారులకు కిట్‌లను అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సీలేరు: గతేడాది సెప్టెంబరు 8న సంభవించిన తుపాను కారణంగా తీవ్రంగా నష్టమైన జీకే వీధి మండలంలోని చట్రాపల్లి, మాదిగమల్లా, నిమ్మచెట్టు, దారకొండ గ్రామాలను ఏపీటీఎఫ్ బృందం మంగళవారం సందర్శించారు. తుపాను వల్ల జరిగిన నష్టాలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో నష్టమైన పాఠశాలలను పరిశీలించారు. వరద బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయమందించారు. విద్యార్థులకు దుప్పట్లు, జంభూఖానాలు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఫెడరేషన్ సభ్యులు శ్రీనివాసులు, ధనుంజయ్, పెద్దబ్బాయి, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు నివాళి


సాంబశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఎటపాక: ఆదివాసీ పోరాట యోధుడు తాటి సాంబశివరావు వర్ధంతిని మండలంలోని మేడివాయిలోని కొమరం భీమ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీల విద్యాభ్యున్నతికి సాంబశివరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నర్సింహరావు, వినోద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీసా కమిటీ ఎన్నికలు

అరకులోయటౌన్: మండలంలోని గన్నెల పంచాయతీ కేంద్రంలో మంగళవారం పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా రమేష్‌కుమార్, కార్యదర్శిగా తడబారికి సంతోష్‌ను ఎన్నుకున్నట్టు ఎంపీడీవో లవరాజు తెలిపారు.
ముంచంగిపుట్టు: మండలంలో పీసా కమిటీ ఎన్నికలు మంగళవారంతో ప్రశాంతంగా జరిగాయి. దార్రెల, కించాయిపుట్టు పంచాయతీల్లో తహసీల్దార్ నర్సమ్మ, ఎంపీడీవో శ్రీసాయిహర్షల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో కార్యదర్శి, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

ఏం కొనలేం.. తినలేం



- బెంబేలెత్తిస్తున్న వంట నూనె ధరలు
- లీటర్‌పై రూ.50 నుంచి రూ.60ల వరకు భారం
- అదే తరహాలో కూరగాయల రేట్లు
- కొనుగోలు చేయలేని దుస్థితిలో సామాన్యులు

అరకులోయటౌన్: అరకులోయ పట్టణంలో నిత్యవసర సరకులు, కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. వంట నూనె ధరలు కాకపుట్టిస్తున్నాయి. ఏ కంపెనీకి చెందిన మంచి నూనె కొనాలన్నా ఇంతకు ముందు ఉన్న ధర కన్నా భారీగా పెరగడంతో సామాన్య ప్రజలకు భారంగా మారింది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూనె ఒక్క లీటరుపై రూ. 50 నుంచి రూ.60 వరకు ధర పెరిగింది. దీంతో సామాన్యుడిపై పెనుభారం పెరిగింది. గిరిజనుడి వంటింట్లో పొయ్యి వెలగడం కష్టమైంది.

ధరల నియంత్రణకు ప్రభుత్వాలు వెనకడుగు

కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ధరల నియంత్రణపై వెనకడుగు వేస్తున్నాయి. సంక్షేమ పథకాలు అందని గిరిజనులు పెరిగిన వంట నూనెలు ధరలు, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో మరింత కలవరపాటుకు గురువుతున్నారు. కోరుకున్న వంటలు వండి రుచి కరమైన ఆహారం తినలేకపోతున్నారు. మంచి నూనె లీటర్ పట్టణ ప్రాంతంలో రూ.160, గ్రామీణ ప్రాంతంలో రూ. 170, ఉల్లిపాయ కిలో రూ.60, టమాట కిలో రూ. 80 మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కందిపప్పు పేదోడికి అందకుండా పోతోంది. ఈ ధరలు సామాన్యులకే కాదు హోటళ్ల నిర్వహకులకు బెదరగొడుతోంది. అలాగే ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాలు, గురుకులం వసతి గృహాలు, కేజీబీవీలలో ఏం చేయాలో తెలియక నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరకుల ధరలు పెంచిన దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. అప్పటికీ, ఇప్పటికీ నిత్యావసర సరకుల ధరలు, కూరగాయల ధరలు మరింతగా పెరిగాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని వసతి గృహాల నిర్వాహకులు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో సామాన్య, మధ్య తరగతి, నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలకు హాయిగా ఉండేది. కానీ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో మాటలు తప్పా, చేతలు చూపించకపోవడంతో ఎటువంటి పథకాలు అమలుచేయకపోవడంతో సామాన్యుడికి కష్టాలు తప్పడంలేదు.

నిత్యావసర సరకుల ధరల్లో పెరుగుదల ఇలా....



వస్తువులు	జనవరి నెలలో... (కిలో)	డిసెంబర్ నెలలో... (కిలో)
పసుపు	180	220
కారం	300	350
కందిపప్పు	150	180
పెసరపప్పు	100	130
బఠాణి	60	80
శనగపప్పు	80	110
శనగ పలుకులు	110	150
మినపప్పు	100	140
ఉల్లిపాయలు	40	80
రిఫైండ్ ఆయిల్ (1 లీటరు)	120	170
పామాయిల్ (1 లీటరు)	90	120
కూరగాయలు	**జనవరి నెలలో... రూ. (కిలో)**	**డిసెంబర్ నెలలో... రూ. (కిలో)**
టమాట	50	80
ఉల్లిపాయలు	40	60
అల్లం	80	90
వెల్లుల్లి	240	350
బీరకాయలు	40	60
బెండకాయలు	40	80
క్యాలీ ఫ్లవర్	40	60
క్యారెట్	40	60
నాన్ వెజిటేరియన్ (కిలో)...		
స్కిన్‌లెస్ చికెన్	200	260
మటన్	800	900
నాటుకోడి	800	1000

సామాన్యులపై భారం



గతంలో ఇంత ధరలు పెరగలేదు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు సామాన్య ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి, ఎప్పుడూ పుష్కలంగా కూరగాయలు కొనే వారంతా ఆలోచిస్తున్నారు. సామాన్యులపై భారం పడుతోంది. ప్రభుత్వం ధరలు తగ్గిస్తే ప్రజలకు, వ్యాపారులకు బాగుంటుంది.

అడకట్ల త్రినాథ్, కూరగాయల వ్యాపారి, అరకులోయ

ధరలు నియంత్రించాలి



నిత్యావసర సరకుల ధరలు అమాంతంగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా రేట్లు ఇప్పుడు పెరిగాయి. సామాన్యులపై గుది బండలా ఈ ధరలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలి.

– తులసి, డింగ్రిపూట్ గ్రామం, అరకులోయ

చదువుతోనే ఉన్నత భవిష్యత్

ముంచంగిపుట్టు: చదువుతోనే ఉన్నత భవిష్యత్తు సాధించవచ్చునని జర్రెల సర్పంచ్ ఎన్.భాగ్యవతి అన్నారు. మండలంలో గల జర్రెల పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ భాగ్యవతి, ఆమె భర్త సురేష్‌లు మంగళవారం సొంత సొమ్ముతో 32 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్టేషనరీ సామగ్రి అందజేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని అర్థం చేసుకుంటూ చదువుకోవాలని, అన్ని సబ్జెక్టులలో పట్టు సాధించాలని, ముఖ్యంగా పేదరికం జయించాలంటే చదువునే ఆయుధంగా వినియోగించుకోవాలన్నారు. పాఠశాల చైర్మన్ గాసిరాం, ఉపాధ్యాయులు బోడురాజు, గణపతి, విద్య వలంటీర్ సిద్దేశ్వరరావు, గ్రామ పెద్దలు త్రినాథ్, సూరి, కనకమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందజేసిన సర్పంచ్ భాగ్యవతి

10న వైకుంఠ ఏకాదశి మహోత్సవం

అడ్డతీగల: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 10న అడ్డతీగలలోని మార్కెట్ వీధిలోని శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో ఏకాహ మహోత్సవం నిర్వహిస్తామని సాయి భజన మండలి, లలిత సత్సంగ్ సభ్యులు మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి మరుసటి రోజు శనివారం ఉదయం 5 గంటల వరకూ భజన కళాకారులచే భక్తి గీతా ల ఆలాపన జరుపుతామన్నారు. శుక్రవారం వేకువజామునే 4.30 గంటలకు సుప్రభాత పఠనం, 5 గంటలకు నగర సంకీర్తన, 5.30 గంటలకు అష్టోత్తర శతనామ పూజ నిర్వహిస్తామన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

వై.రామవరం: మండలంలోని పియర్రగొండ గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ పాఠశాల విద్యార్థుల సహాయంతో 50 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి , భూసార పరీక్షలు చేశారు. అనంతరం రైతులకు భూసార పరీక్షలు చేసిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతు భూసార పరీక్షలు ద్వారా పంటలు వేయడం వలన కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ పీడీ డాక్టర్ జ్యోతిర్మయి, ఏడిఏ సావిత్రి, ఎంఏవో ఉషారాణి, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల్లో సంక్రాంతి సందడి


అరకులోయ డిగ్రీ కళాశాలలోని సంక్రాంతి వేడుకలు


చింతపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రదర్శన

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోగి, సంక్రాంతి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్ ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ సుందరి రాణి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఈ మేరకు కళాశాల ఆవరణలో భోగి మంట వేసి సందడి చేశారు. ర్యక్రమానికి మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సభ్యురాలు వై. విజయలక్ష్మి, ఎం.అనితకుమారి, భవాని, ఎన్ఎస్ఎస్ పీవో పి.నాగబాబు, ఐక్యూఏసీ కో–ఆర్డినేట్ డాక్టర్ కె.కొండబాబు, అధ్యాపకులు లచ్చన్న, గణేష్, సోంబాబు, సురేష్, కామేశ్వరరావు, అప్పారావు, దొన్ను విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు ఈ నెల 10 తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని చింతపల్లిలో నిర్వహించే ఈ సంబరాల్లో స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చనన్నా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, కుర్చీలాట పోటీలను నిర్వహించనున్నట్టు చెప్పారు.అదే విధంగా సంప్రదాయ దుస్తు లు అలంకరణ, నృత్య పోటీలతో పాటు పాటలు తదితర పోటీలను నిర్వహిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1500, ద్వితీయ బహుమతి రూ.1000, తృతీయ బహుమతిగా రూ.500 అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలవాలి

గిరిజన విద్యార్థులు మంచి చదువులతో ఉన్నత స్థానాలను పొందాలని బాలికల పాఠశాల హెచ్ఎం జె.కొండలరావు అన్నారు. పాఠశాల ఆవరణలో మంగళవారం సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలను దిశగా విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు సందడి చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. వార్డెన్ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

76 మందికి వైద్య పరీక్షలు


శిబిరానికి వచ్చిన గ్రామస్తులు

ముంచంగిపుట్టు: శీతాకాలంలో ప్రతి ఒక్కరు ఆరోగ్య రక్షణ తీసుకోవాలని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం కిలగాడ వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్న 76 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం పెరిగిన చలి, మంచుతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ మంచు, చలితో అప్రమత్తంగా ఉండాలని, స్వెటర్లు, గ్లౌజ్‌లు వేసుకోవాలని, ముఖ్యంగా అస్తమా రోగులు బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు ధరించాలని సూచించారు. చలిలో తిరగడం, చల్లటి నీరు తాగడం చేయకూడదన్నారు. విటమిన్–సి లభించే ఆహారం తీసుకోవడం మంచిదన్నారు. వైద్య సిబ్బంది మహేశ్వరి, అశోక్, రోషిణి, మత్స్యకొండమ్మ, 104 డిఈవో కృష్ణవేణి తదితరులు పాల్గొనానరు.

ప్రభుత్వ ఉద్యోగ సంఘాల క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ


డుంబ్రిగుడలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్


పాడేరులో క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల సంఘం సభ్యులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాధరావు మాట్లాడుతూ ఏటా నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించి సహచర ఉద్యోగులకు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు: పట్టణంలోని ఏపీ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్–327 ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం, భారీ ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ఆవరణలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శులు రాఘువరెడ్డి, మంత్రి రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం యూనియన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు.
విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంఘం డైరీని ఆవిష్కరించారు. ప్రతినిధులు బి.నాగేశ్వరరావు, బి.శివ ప్రసాద్, త్రిమూర్తులు, భాస్కర్‌రావు, వెంకటరమణ, ఈశ్వర్‌రావు, విద్యుత్ ఉద్యోగులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో గిరిజన విద్యార్థి ప్రతిభ


ప్రశంసాపత్రం అందుకుంటున్న నాగిరెడ్డి

ఎటపాక: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025లో ఎటపాక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్ఎ(పిడి) ఎస్.నాగిరెడ్డి విశేష ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 4,5 తేదీల్లో జరిగిన పోటీల్లో 45 ఏళ్ల గ్రూప్‌లో 100 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించాడు. జావెలిన్‌త్రోలో ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం, 4/100 మీటర్లు రిలేలో ద్వితీయ స్థానం సాధించారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకూ కేరళలో నిర్వహించే మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌కి ఎంపికయ్యారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం


వేటమామిడిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ సూర్యారావు తదితరులు


అరకులోయలో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు


డుంబ్రిగుడలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడిలో మంగళవారం రెవెన్యూ సదస్సుని తహసీల్దార్ కొమరం సూర్యారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. భూ సమస్య పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఎం.రాజమ్మ, బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి చెప్పారు. పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు.
అరకులోయటౌన్: మండలంలోని పద్మాపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వైస్ సర్పంచ్ భగత్‌రామ్, పీసా కమిటీ కార్యదర్శి గోపి తదితరులు తహసీల్దార్ ఎం.వి.వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.
గిరిజనేతరులకు జారీ చేసిన ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కోరారు. గిరిజనేతరులు పొందిన బినామీ పత్రాలతో అన్ని పథకాలు పొందడంతో గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్‌కుమార్, రాజా, రాము, సన్యాశి, తదితరులు పాల్గొన్నారు.
డుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయితీ గొందిగుడ గ్రామంలో ఆర్ఐ బీపీఎం రాజు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ పరమైన సమస్యలు, భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు ఉపాయోగించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. వీఆర్‌వో, వీఆర్ఏతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.
రాజవొమ్మంగి: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు ఓ చక్కని వేదిక అని తహసీల్దార్ అల్లు సత్యనారాయణ అన్నారు. రాజవొమ్మంగి సచివాలయంలో జరిగిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు, ఆర్ఐ చెల్లమ్మ పాల్గొన్నారు.